క్లుప్తంగా

ఏఎన్‌యూలో డాక్టర్ రెడ్డీస్ క్యాంపస్ డ్రైవ్



పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎమ్మెస్సీ (బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ) విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ ఆన్ క్యాంపస్ డ్రైవ్ (ఆన్‌లైన్ అసెస్మెంట్) నిర్వహించడం జరిగిందని ఇంజనీరింగ్ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తాసిఫ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఈ డ్రైవ్‌లో సైన్స్ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సూర్య కామేశ్వరి విద్యార్థులను సమన్వయపరిచారు. ఈ డ్రైవ్‌కు 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. డాక్టర్ రెడ్డీస్ హెచ్ ఆర్ టీం నుంచి వై.నైనా, గ్రేస్ ఆమోర్ పర్యవేక్షించారు. ఈ ఆన్‌లైన్ అసెస్మెంట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ నెల 16, 17 తేదీలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో శుక్రవారం సాక్షి దినపత్రికలో మురికి నీరే తాగునీరు శీర్షికన ప్రచురించిన వార్తకు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ స్పందించారు. గ్రామంలోని లక్ష్మీనరసింహపురం కాలనీలో వర్షం కురిస్తే మురిని నీరు ట్యాప్‌ల ద్వారా వస్తుందని ప్రచురించిన వార్తకు స్పందించి వాటర్ పైప్‌లైన్ లీకులను పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. ఒక పాత గృహ యజమాని ఇంటి పైప్‌లైన్ పాడైపోవడం వల్ల వర్షం నీరు పైప్‌లైన్‌లోకి చేరుతుందని తెలుసుకొని దానిని రిపేరు చేయించడం జరిగిందని రవికుమార్ తెలిపారు. లక్ష్మీనరసింహపురం, మిర్చియార్డ్ కాలనీ రోడ్డులో రెండు ప్రాంతాలలో రిపేర్లు చేయించడం పూర్తయిందని చెప్పారు. ఈ సందర్భంగా తమ సమస్యను పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతకు సన్మానం



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యాయామ విద్య డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ దంపతులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఏఎన్‌యూ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న పాల్‌కుమార్ ఈ ఏడాది స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఈ నెల 5న సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల నుంచి ఆయన అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో వ్యాయామ విద్య అధ్యాపకుల కార్యవర్గం అసోసియేషన్ పాల్‌కుమార్‌ను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని పాల్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు.

ఆశావర్కర్ కుటుంబానికి న్యాయం చేయాలి



చేబ్రోలు: నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన ఆశావర్కర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకొని న్యాయం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ అన్నారు. చేబ్రోలుకు చెందిన ఆశావర్కర్ ఐ.సులోచన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం మరణించింది. తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు సులోచన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించటానికి వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌వోను యూనియన్ నాయకులు సులోచన కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో అర్హతను బట్టి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. చేబ్రోలులోని అధికారుల విధానాల వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. అనారోగ్యం సరిగా లేదని చెప్పినా సెలవు ఇవ్వకుండా ప్రాణాల మీదకు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్.. నిరుపయోగం

- చేబ్రోలులో అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీ ఆదాయానికి గండి
- ఏడాదిగా పంచాయతీకి సొమ్ము చెల్లించని వైనం



చేబ్రోలులో నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

చేబ్రోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ ఆదాయ వనరులు సమకూర్చటం కన్నా వ్యక్తిగత ఆదాయంను పెంచుకోవటంలో నాయకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. చేబ్రోలు మార్కెట్ సెంటర్‌లో గ్రామ దేవత శ్రీరాములమ్మ తల్లి ఆలయ సమీపంలో గ్రామ పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారటంతో పంచాయతీకి లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోవటంపై పలువురు విమర్శిస్తున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం పంచాయతీ ఆదాయానికి శాపంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని 9 గదులను దీర్ఘకాలంగా వివిధ వర్గాలకు చెందిన వారు నిర్వహించుకుంటూ పంచాయతీకి అద్దె చెల్లిస్తున్నారు. దీనిలో మూడు షాపులు ఎస్సీలకు, మూడు షాపులు ఓసీలకు, రెండు షాపులు బీసీలకు, ఒక షాపు ఎస్టీలకు కేటాయించారు. ఒక్కో షాపుకు నెలకు రూ.3,500 అద్దె చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులను ఖాళీ చేయించి తమకు అనుకూలమైన వారికి కేటాయించుకోవటం కోసం కొత్త విధానానికి తెరదీశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదులను రూ.20 వేలు, రూ.21.5 వేలు, రూ.19 వేలు, రూ.17.5 వేలు,రూ.19.5 వేలు, రూ.13.5 వేలు, రెండు షాపులు రూ.5.5 వేలు, ఒక షాపు రూ.7.5 వేలకు వేలం పాటలో పాడుకున్నారు. వేలం పాటలు జరిగి నాలుగు నెలలు పూర్తవుతున్నా పాట పాడుకున్న వారు డిపాజిట్ చెల్లించటం, అద్దె చెల్లించటం మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఇప్పటి వరకు సుమారు రూ.6 లక్షల ఆదాయం పంచాయతీకి నష్టం జరిగిందని పలువురు వాపోతున్నారు.

- అలాగే కబేళా వేలం పాటను రూ.1.44 లక్షలకు పాడుకున్న వ్యక్తి పంచాయతీకి చెల్లించాల్సిన రుసుం చెల్లించకపోవటంపై కూడా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడినట్లు అయింది. గత ఏడాది మార్కెట్ రుసుం వసూలు వేలం పాట రూ.9 లక్షలకు పాడుకున్న వ్యక్తి నుంచి పంచాయతీకి రావలసిన ఆదాయం నేటి వరకు జమ కాలేదు. ఏడాది పాటు మార్కెట్ రుసుం వసూలు చేసుకున్న వ్యక్తి వద్ద నుంచి నేటి వరకు పంచాయతీకి చెల్లించాల్సిన సొమ్ము రూ.9 లక్షలు వసూలు చేయటంలో పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఏడాది పాటు కాలయాపన చేసి నేడు నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆదేశ్వరరావు, సీపీఐ నాయకులు

ప్రత్తిపాడు: వామపక్ష ఉద్యమ నేత ఏచూరి సీతారాం గొప్ప పోరాట యోధుడని సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక పార్టీ నాయకులు నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పార్టీకి దిశానిర్దేశం చేసిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంజిబాబు, బీసీ నాయకులు కొండూరి అంకమ్మరావు, ఎం.పిచ్చయ్య, పసుపులేటి వీరయ్య, తాతారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళులు

కాకుమాను: పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేయడమే ఏచూరికి మనమిచ్చే ఘన నివాళి అని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా నాయకుడు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. తొలుత సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, రాజేంద్ర, భువనేశ్వరి, షమ్మీ, మర్రి లక్ష్మి, కొర్రపాటి లక్ష్మి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని: లౌకిక విలువల కోసం పోరాడిన మహనీయుడు సీతారాం ఏచూరి అని మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ లౌకిక విలువలను కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని, లౌకిక విలువలను కాపాడడం కోసం జీవితాంతం కృషి చేసిన కామ్రేడ్ సీతారాం కృషిని కొనసాగించడమే మనం ఆయనకు అర్పించగల నిజమైన నివాళి అన్నారు. సీపీఎం నాయకులు జి.రాజారమేష్, ఎ.నాగేశ్వరరావు, కె.గురువమ్మ, ఆర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకుమాను: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ ఏఈ పఠాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండంలోని వల్లూరు, రేటూరు, కొమ్మూరు, గార్లపాడు, పెద్దివారిపాలెం, అప్పాపురం గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని శవం ఛిద్రమైన దశలో ఉందని సమాచారం మేరకు ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామన్నారు. మృతుడు సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని ఆచూకీ తెలిసిన వారు నేరుగా గుంటూరు రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం యనమదలలోని బీఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాలలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.అమృత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసి ప్రస్తుతం ఏ కళాశాలలో చేరని విద్యార్థులు, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా కోర్సులో చేరవచ్చన్నారు. ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ద్వారా స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీతో అడ్మిషన్లకు గడువు ముగుస్తుందని, మరిన్ని వివరాలకు 9110523239 నంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- ఐఈఈఈ గుంటూరు సబ్ సెక్షన్ వైస్ చైర్ డాక్టర్ కాట్రగడ్డ స్వర్ణ
- మలినేనిలో అట్టహాసంగా ప్రజ్ఞ–2025 సాంకేతిక సదస్సు



ప్రజ్ఞ–2025 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐఈఈఈ గుంటూరు సబ్ సెక్షన్ వైస్ చైర్ డాక్టర్ కాట్రగడ్డ స్వర్ణ

ప్రత్తిపాడు: సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ఐఈఈఈ గుంటూరు సబ్ సెక్షన్ వైస్ చైర్ డాక్టర్ కాట్రగడ్డ స్వర్ణ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో ఐఈఈఈ విద్యార్థి శాఖ గుంటూరు సబ్‌సెక్షన్ సహకారంతో ప్రజ్ఞ–2025 సాంకేతిక సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఈఈఈ గుంటూరు సబ్ సెక్షన్ వైస్ చైర్ డాక్టర్ కాట్రగడ్డ స్వర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ ఐఈఈఈ సభ్యత్వం పొందడం ద్వారా విద్యార్థులు టెక్నాలజీ పరిజ్ఞానం పెంపొందించుకో వచ్చన్నారు. కళాశాలల్లో జరిగే సాంకేతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని ఇన్నోవేషన్, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ప్రయోజనకరమన్నారు. అనంతరం ప్రజ్ఞ–2025 లోగోను ఆవిష్కరించారు. మలినేని కళాశాలల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు వారికి వచ్చిన ఆలోచనలను తోటి విద్యార్థులతో పంచుకుని, నెట్‌వర్కింగ్ అవకాశాలను సృష్టించుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇన్నోవేటివ్ కార్యక్రమాల్లో పాల్గొనడం వలన బహుళ ప్రయోజనాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, ప్రోగ్రాం కన్వీనర్ ఈసీఈ విభాగం హెడ్ డాక్టర్ డి.విజయ సారథి, డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీయూలో కృత్రిమ మేధ లాంగ్వేజ్ మోడల్స్‌పై సదస్సు



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీలో ఏసీఎం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు ప్రధాన సూత్రాలు, పద్ధతులు, లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్)పై సదస్సును నిర్వహించారు. నంబూరు వీవీఐటీయులో శుక్రవారం జరిగిన సదస్సుకు ముఖ్యవక్తగా అమెరికాకు చెందిన కృత్రిమ మేధ, న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ నిపుణుడు, సాల్మన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, సీఈవో పాల్ సాల్మన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్ సాల్మన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లలో విప్లవాత్మక మార్పులు తీసురాబోతున్నాయని అన్నారు. ఏఐ అనేది కంప్యూటర్లు, యంత్రాలు మానవ అభ్యాసం, సమస్య పరిష్కారం, స్వయం ప్రతిపత్తిని అనుకరించడానికి వీలు కల్పించే సాంకేతికత అని తెలిపారు. కృత్రిమ మేధస్సుతో కూడిన అప్లికేషన్, పరికరాలు వస్తువులను చూడగలవు, గుర్తించగలవన్నారు. ఉదాహరణకు స్వీయ డ్రైవింగ్ కార్లు అని వివరించారు. వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, సీఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్, సీఏఐ విభాగాధిపతి డాక్టర్ పి.సుధాకర్, ప్రోగ్రామ్ సంధానకర్త డాక్టర్ బి.సాయిజ్యోతి, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూకు విశ్రాంత ఉద్యోగి వితరణ



వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావుకు చెక్కు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఏఎన్‌యూ గోల్డెన్ జూబ్లీలోకి అడుగు పెట్టిన సందర్భంగా విశ్రాంత ఉద్యోగి ఒగ్గు నాగేశ్వరరావు రూ.50 వేలను వితరణగా అందజేయడం అభినందనీయమని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఒగ్గు నాగేశ్వరరావు రూ.50 వేలను వర్సిటీకి వితరణగా అందజేశారు. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణిలకు ఆయన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య గంగాధర్‌రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పట్ల నాగేశ్వరరావు చూపిన అంకితభావంను అభినందించారు. ఒగ్గు నాగేశ్వరరావు ప్రస్తుతం పెన్షనర్ల సంఘం కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంలో పెన్షనర్ల సంఘం, ఇతర సహచర ఉద్యోగులు నాగేశ్వరరావు అందించిన వితరణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తురకపాలెం బాధితులకు న్యాయం చేయాలి

భీమసేన రాష్ట్ర యువజన అధ్యక్షుడు గాలి అశోక్‌ఆనంద్



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భీమసేన రాష్ట్ర యువజన అధ్యక్షుడు గాలి అశోక్‌ఆనంద్

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో మరణించిన బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని భీమసేన రాష్ట్ర యువజన అధ్యక్షుడు గాలి అశోక్‌ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం తురకపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం తరపు నుంచి సాయం అందేలా చేస్తానన్నారు. ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాగునీరు కలుషితం అవడం వల్లే గ్రామంలో 29 మంది మృతి చెందారని వాపోయారన్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై సీఆర్పీలకు శిక్షణ



చేబ్రోలు: గ్రామీణ ప్రాంతాలలో శాస్త్రీయ, సుస్థిరమైన, వికేంద్రీకృత పద్ధతిలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను, బలోపేతం చేసే లక్ష్యంతో సీఆర్పీల ఎంపిక జరిగిందని జిల్లా పంచాయతీ వనరుల కో ఆర్డినేటర్ అనూరాధ అన్నారు. చేబ్రోలులోని చెత్త సంపద కేంద్రంలో శుక్రవారం కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు మండలాలకు చెందిన సీఆర్పీలకు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. క్రియాశీల మహిళలను సీఆర్పీలుగా ఎంపిక చేశామని, గృహ స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.ఉషారాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



ప్రత్తిపాడు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పీఏసీఎస్ అధ్యక్షుడు పాతూరి కృష్ణారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేస్తున్న పసుపులేటి శ్రీధర్ ఈ నెల 5వ తేదీన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ పాతూరి శివపార్వతి, ప్రవాసాంధ్రుడు పాతూరి రాంబాబు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీధర్‌ను స్థానికులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో యోగా, కోలాటం, చేతిరాత నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంభంపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వీర్ల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వల్భాపురపు సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పాతూరి కృష్ణారావు, గ్రామ పెద్దలు కొణిజేటి బుల్లిబాబు, శివరామకృష్ణయ్య, నాగరాజకుమారి, భీమినేని సింగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



వినతిపత్రం అందజేస్తున్న టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

పొన్నూరు: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు ఎం.ఎం.ఖుద్దూస్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఖుద్దూస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ ఆలేటి మాధవికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.శేషగిరిరావు, మండల కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ప్రవీణ్ కుమార్‌కు సీఎస్ఈ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మర్ బేస్డ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ ఎమోషన్ రికగ్నిషన్ ఇన్ ఇంగ్లిష్ పొయిట్రీ' అనే అంశంపై ప్రవీణ్‌కుమార్ పరిశోధన చేశారని తెలియజేశారు. ఆయన తన పరిశోధనలో భాగంగా 1 ఎస్‌సీఐ, 3 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను పలువురు అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో సదస్సు



గుంటూరు రూరల్: మెరుగైన నెట్‌వర్క్‌ల పనితీరుకు సమర్థవంతమైన రూటింగ్ ప్రొటోకాల్ దిశగా విద్యార్థులు ఆలోచనలు చేస్తూ, సాంకేతిక సమస్యలకు పరిష్కార మార్గాలను శోధించాలని ప్రముఖ సాంకేతిక రంగ నిపుణులు డాక్టర్ సతీష్ అనమలమూడి తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సపోర్టింగ్ అసిమెట్రిక్ లింక్స్ ఇన్ లో–పవర్ నెట్‌వర్క్స్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నెట్‌వర్క్ టెక్నాలజీ పరిణామాల్లో ఏవోడీవీ ఆర్‌పీఎల్ పద్ధతి ద్వారా తక్కువ విద్యుత్ వినియోగం చేసే నెట్‌వర్క్‌లలో అసమానమైన లింక్‌లను సపోర్ట్ చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ తరహా సాంకేతికత స్మార్ట్ డివైజ్‌లు, సెన్సార్ నెట్‌వర్క్‌లు, ఐఓటీ, వినియోగంలో తక్కువ శక్తితో ఎక్కువ పనితీరు అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యంతో నెట్‌వర్క్‌ల సామర్థ్యాన్ని మెరుగు పరుస్తూ, ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. వర్క్‌షాప్‌లు విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన, పరిశోధనల దిశగా ఆలోచనలకు దారి తీస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల కృతజ్ఞత సభను జయప్రదం చేయండి



ప్రత్తిపాడు: మాదిగల కృతజ్ఞత సభను జయప్రదం చేయాలని ఎంఆర్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినుకొండ ఏసుబాబు అన్నారు. ఈ నెల 22న తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో మాదిగల కృతజ్ఞత సభను ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆదేశాల మేరకు సభకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నియోజవకర్గ కేంద్రం ప్రత్తిపాడులో నిర్వహించారు. స్థానిక బస్టాండు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గ అధ్యక్షుడు, వినుకొండ ఏసుబాబు మాదిగ, జిల్లా కార్యదర్శి డి.బాబురావు మాదిగల ఆధ్వర్యంలో 'మాదిగల కృతజ్ఞత సభ' కరపత్రాలను స్థానిక ఎంఆర్పీఎస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయకుమార్ మాదిగ, కె.బెర్నార్డ్ మాదిగ, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కొమరాల శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.